క్లుప్తంగా

అనంతగిరిలో సీసీ డ్రైనేజీ పనులు ప్రారంభం


కాలువల నిర్మాణ కోసం వీధులను పరిశీలిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: అనంతగిరి పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.16 లక్షలు వెచ్చించి సీసీ డ్రైనేజీలను నిర్మిస్తున్నట్లు సర్పంచ్ కాటకాన మల్లేశ్వరరావు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ సతీష్ ఆధ్వర్యంలో కాలువల నిర్మాణానికి ఆదివారం కొలతలు వేసి పనులు ప్రారంభించారు. స్థానికంగా ఉన్న నివాస గృహాల వారితో మాట్లాడి పనుల చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రధానంగా వెంకటాపురం, అనంతగిరి కాలనీల్లో మూడు వీధుల్లో ఈ పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. వర్షాలు పడుతున్న సమయంలో వీధులు వరద నీటితో నిండిపోతున్నందున కాలువలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. పరిశీలనలో ఎంపీటీసీ సభ్యుడు ఉరిటి కామేశ్వరరావు ఉన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి


మొక్కలను నాటుతున్న గ్రీన్ ఆర్మీ ప్రతినిధులు

పలాస: పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ అన్నారు. చినంచల గ్రామం శివాలయం ప్రాంగణంలో ఆదివారం మొక్కలు నాటే ప్రక్రియ చేపట్టారు. ఉసిరి, మారేడు, కదంబం, బాదం, వేప తదితర ఔషధ మొక్కలను నాటారు. వర్షాకాలంలో మొక్కలను నాటితే త్వరగా ఉపయోగంలోకి వస్తాయన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రోణంకి శాంతికుమారి, గ్రామ పెద్ద బొత్స మధుబాబు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు ఆస్పాన మధుబాబు, రోణంకి వెంకటరమణ, ఉపాధ్యాయులు దాసరి శ్రీనివాస్, బోకర దుర్యోధన, మన్మథరావు, ఆర్టీవో దాసరి వైకుంఠరావు, తిరుమలరావు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా పీహెచ్‌సీ భవనాలు


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పీహెచ్‌సీ భవనాలు

వజ్రపుకొత్తూరు: వెంకటాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాలు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. నాడు–నేడు పథకం నిధులు రూ.1.80 కోట్లతో కొత్త భవనాలను నిర్మించారు. వచ్చే నెలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలాస నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో దీన్ని ప్రారంభించేందుకు వీలుగా అధికారులు అన్ని పనులను పూర్తి చేసి సుందరంగా ముస్తాబు చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కనీసం పునాది రాయి కూడా పడని ఈ పీహెచ్‌సీని అప్పటి ఎమ్మెల్యే గౌతు శ్యామసుందర శివాజీ బ్రాహ్మణతర్లాకు తరలించేందుకు ప్రయత్నించగా.. స్థానికులు నిరసన తెలియజేయడంతో వెనక్కి తగ్గారు. ఆ తరువాత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్ని హంగులు సమకూర్చారు. కొత్తగా భవనాలను నిర్మించారు.

పైడి, దండాసి కుల సర్టిఫికెట్లను సచివాలయాల్లో ఇవ్వాలి

మందస: పైడి, దండాసి కులాల సర్టిఫికెట్లను సచివాలయాల్లో అందజేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మందస దళిత ఐక్యవేదిక నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆయా సామాజికవర్గాలు కుల సర్టిఫికెట్లకు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒంగోలులో గిరిజన యువకుడిపై మూత్రం పోసిన వారిని, మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని నాయకులు సీహెచ్ సత్యం, నగిరి కరుణాకర్, ఎస్.గణేశ్వరరావు, జి.భీమారావు, ఎస్.విజయ్ కోరారు.

జీడి పంటకు మద్దతు ధర ప్రకటించాలి

వజ్రపుకొత్తూరు: జీడి రైతును ఆదుకునేందుకు ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటించాలని బీజేపీ జిల్లా మత్స్యకార సెల్ కన్వీనర్ గుంటు ధనరాజ్ కోరారు. రైతుల పక్షాన నిలబడే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీడి రైతుల పట్ల ఉదారంగా వ్యవహరించాలన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా జీడి రైతులకు అండగా నిలవాలన్నారు. 80 కిలోల బస్తాకు రూ.15 వేలు మద్దతు ధర ప్రకటించే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. మూతబడిన జీడి పరిశ్రమలను తెరిచి కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు.

● శాంతి యజ్ఞం


పలాస మండలం చినంచల గ్రామంలో ఆదివారం శాంతి యజ్ఞం జరిగింది. సదానంద సద్గుర స్వామి ఆధ్వర్యంలో గ్రామస్తులు మహాయజ్ఞాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 24 గంటల అఖండ నామ సంకీర్తనలు భక్తిశ్రద్ధలతో ఆలపించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన చేశారు. పూజల్లో గ్రామ పెద్దలు, భక్తులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు. -పలాస

● వరినారుకు జీవం


వరుణ దేవుడు కరుణించాడు. మోస్తరుగా కురిసిన వర్షంతో ఎండిపోతున్న వరి నారుకు జీవం వచ్చింది. పొలాల్లో కూడా నీరు చేరింది. దీంతో రైతన్నలు ఆదివారం రోజంతా పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. దమ్ములు, దుక్కులు చేపట్టారు. -ఇచ్ఛాపురం రూరల్

● గోసంరక్షణకు..


గోవుల సంరక్షణకు ప్రతిఒక్కరు కృషి చేయాలని రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు దుద్ది శ్రీను, పి.వి.కృష్ణారావు అన్నారు. బారువ గోశాలకు ఎనిమిది బస్తాల దాణా, అటుకులు, బెల్లం, అరటి పండ్లను ఆదివారం రోటరీ క్లబ్ సౌజన్యంతో అందజేశారు. గోశాల నిర్వాహకురాలు ఆదిలక్ష్మి, రోటరీ ప్రతినిధులు వి.శివశంకర్, టి.వి.వెంకటరమణ, మధు పాల్గొన్నారు. -సోంపేట

ఆర్టీసీ అభివృద్ధికి సహకరించండి

● మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమల రావు

కాశీబుగ్గ: ప్రజలకు అధునాతన సేవలు అందిస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ అభివృద్ధికి అందరూ సహకరించాలని ఆ సంస్థ ఎండీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు అన్నారు. పలాస ఆర్టీసీ డిపోను ఆదివారం సందర్శించారు. తొలుత కాంప్లెక్సులో ప్రజలకు అందుతున్న సౌకర్యాలపై ఆయన ఆరాతీశారు. అనంతరం డిపో ఆవరణలో మొక్కను నాటారు. గ్యారేజీని సందర్శించి కార్మికులతో మాట్లాడారు. పరిసరాల్లో ఉన్నటువంటి స్థలాలను లీజుకు ఇచ్చే విషయంపై సంబంధిత అధికారులతో మాట్లాడి ఆరాతీశారు. సంస్థకు చెంది ఖాళీగా ఉన్న స్థలాలను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. రానున్న కొద్ది రోజుల్లో కొత్త బస్‌లను డిపోకు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. సంస్థలో పనిచేస్తున్నటువంటి ఉద్యోగులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించి ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రోత్సాహకాలను అందిస్తామన్నారు. ప్రభుత్వం చక్కనైన ప్రణాళికతో సంస్థను అభివృద్ధి చేస్తోందని.. అందుకు అందరూ సహకరించాలన్నారు. సంస్థ బాగుంటే అందరం బాగుంటామని.. అప్పుడే అద్భుతమైన సేవలు ప్రజలకు అందించగలమన్నారు. కార్యక్రమంలో విజయనగరం జోన్-1 ఈడీ అప్పలరాజు, ఓఅండ్‌పీ అప్పలనాయుడు, శ్రీకాకుళం డీపీటీవో విజయకుమార్, పలాస డిపో మేనేజర్ ఆర్.సీతంనాయుడు, అసిస్టెంట్ మేనేజర్ పి.సంతోష్‌కుమార్, అన్ని యూనియన్ల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


మొక్కనాటుతున్న ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు

ఆరుగురు ఉద్యోగులకు అవార్డుల ప్రదానం

పలాస ఆర్టీసీ డిపోలో పనిచేసి వివిధ కేటగిరీల్లో రాణించిన ఆరుగురు ఉద్యోగులు అవార్డులకు ఎంపికయ్యారు. వీరికి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకాతిరుమలరావు క్యాష్ ప్రైజ్‌తో పాటు అవార్డులను ఆదివారం ప్రదానం చేశారు. ఇంధన పొదుపు విభాగంలో 1230 లీటర్లు పొదుపు చేసిన డ్రైవర్ రెయ్యి ఆదినారాయణ ఈ ఏడాదికి విజేతగా నిలిచారు. ద్వితీయ స్థానంలో ఈజే రావు నిలిచారు. ప్రమాదరహిత డ్రైవర్ల విభాగంలో ప్రథమ స్థానంలో 24 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఎంఎంకే సాహూ, 22 ఏళ్లుగా పనిచేస్తున్న పి.కె.వి.రావుకు ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు. ప్రయాణికులకు పిలిచి మరీ బస్సు ఎక్కించిన ఉత్తమ కండక్టర్‌గా ఎల్.ఎఫ్.చలం, ఎస్.పి.రావు బహుమతులు అందుకున్నారు.


డ్రైవర్ ఆదినారాయణకు బహుమతి అందజేస్తున్న ఎండీ ద్వారకాతిరుమలరావు

గడప గడపలో సంతోషమే ధ్యేయం

● జెడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ
● ముండ్ల గ్రామ సచివాలయం పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కంచిలి: గడప గడపలో సంతోషమే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని ముండ్ల గ్రామ సచివాలయం పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. అలాగే నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని వివరించి బ్రోచర్లను అందజేశారు. ఇంకేమైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టారు. రాష్ట్రంలో మరింత మెరుగైన పరిపాలన కావాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేయాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ ఛైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ రామచంద్ర ప్రధాన్, కుంబరినౌగాం సర్పంచ్ హరిబంధు జన్ని, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


మహిళలకు సంక్షేమాన్ని వివరిస్తున్న జెడ్పీ ఛైర్‌పర్సన్ విజయ

వదంతులను నమ్మవద్దు

మందస: అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని మందస ఎస్ఐ వై.రవికుమార్ ప్రజలకు సూచించారు. విలేకరులతో ఆయన ఆదివారం మాట్లాడుతూ.. ఇటీవల కొన్ని గ్రామాల్లో జరుగుతున్న సంఘటనలపై ప్రజలు చైతన్యం కావాలన్నారు. కొన్ని జిల్లాల నుంచి జుత్తు (కొప్పు) కొనడానికి వస్తున్న వారితో జాగ్రత్తగా ఉండాలన్నారు. అయితే పిల్లలను ఎత్తుకుని వెళ్లిపోతున్నారు, దొంగల ముఠాలు తిరుగుతున్నట్లు వస్తున్న పుకార్లను నమ్మవద్దని హితవు పలికారు. ఇటువంటి సంఘటనలు ఈ ప్రాంతంలో జరుగలేదన్నారు. పిడిమందస పంచాయతీ మధ్య గ్రామంలో జరిగినట్టు వస్తున్న వీడియో, ఆడియోలు సరైనవి కావన్నారు. జుత్తు కొనడానికి వచ్చిన కొందరు ది గ్రామాల్లోని నాటుకోళ్లను దొంగలిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై కూడా సరైన సాక్ష్యాధారాలు లేవన్నారు. గిరిజన ప్రాంతమైన సాబకోటలో కూడా ఇటువంటి సంఘటనలు జరిగినట్టు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారన్నారు. గ్రామాల్లో మహిళలు, యువకులు జాగ్రత్తగా ఉండడమే మంచిదేకానీ, లేని పోనివి అభూత కల్పనలు సృష్టించవద్దని కోరారు. ఎక్కడైనా ఏదైనా సంఘటనలు జరిగితే పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. సచివాలయాల పరిధిలో మహిళా పోలీసుల సేవలను వినియోగించుకోవాలన్నారు.


మాట్లాడుతున్న రవికుమార్

స్థలాక్రమణకు టీడీపీ నాయకుడు యత్నం!

● వ్యాపారి మల్లా గణేష్‌రాజు ఆరోపణ

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ మొగిలిపాడు గ్రామంలో తమకున్న వంద అడుగుల స్థలాన్ని టీడీపీ నాయకుడు మురళి ఆక్రమించడానికి చూస్తున్నారని వ్యాపారి మల్లా గణేష్‌రాజు ఆరోపించారు. స్థలాన్ని భద్రపరుచుకుంటుంటే పార్టీల రంగు పులిమి స్థలాన్ని కబ్జా చేయడానికి చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 201 సర్వే నంబర్ 04లో తమ స్థలాన్ని చదునుచేస్తుంటే టీడీపీ నాయకురాలు గౌతు శిరీషా అడ్డుగా వచ్చి వివాదానికి దిగుతున్నట్లు పేర్కొన్నారు. ఆమెకు ఈ స్థలానికి ఎటువంటి సంబంధం లేదని తేల్చి చెప్పారు. టీడీపీ నాయకుడు మురళికి 201 సర్వే నంబర్ 03లో 20 సెంట్లు స్థలం విక్రయించగా.. ఇప్పుడు 04లో వంద అడుగులు స్థలాన్ని ఆక్రమించుకోవడానికి చూస్తున్నారన్నారు. అక్రమార్కులకు శిరీషా సహాయపడటం ఏమిటని ప్రశ్నించారు. తమ కుటుంబం పలాసలో కోర్టు నిర్మాణానికి, కౌశల్య పేరుతో పేదల కాలనీకి, డేకురకొండ వద్ద శ్మశానానికి కోట్ల రూపాయల విలువైన స్థలాలను వితరణ చేశామని చెప్పారు. అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న తమ కుటుంబానికి చెందిన స్థలాన్ని ఆక్రమించడానికి టీడీపీ నాయకులు కుట్ర పన్నడం తగదన్నారు. టీడీపీ నాయకుడు మురళిపై కాశీబుగ్గ పోలీసు స్టేషన్ పరిధిలో పలు క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయన్నారు. తమకు న్యాయం చేయాని కోరుతున్నామన్నారు.


మాట్లాడుతున్న మల్లా గణేష్‌రాజు

కాలువ పనులకు శ్రీకారం


భూమిపూజ చేస్తున్న వెంకటరమణారావు

కోటబొమ్మాళి: కొత్తపేట పంచాయతీలో పది లక్షల రూపాయల మండల పరిషత్ నిధులతో నిర్మించనున్న కాలువ పనులకు జిల్లా ప్రాదేశిక నియోజకవర్గం సభ్యుడు దుబ్బ వెంకటరమణారావు ఆదివారం భూమి పూజచేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దుక్క రోజారాణి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రోణంకి మల్లయ్య, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.హేమసుందరరాజు, సర్పంచ్ రాంపాత్రుని సావిత్రి పాల్గొన్నారు.

పంచాయతీ ఇన్‌చార్జి ఈవోగా శ్రీనివాసరావు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మేజర్ పంచాయతీలో జూనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న చింతాడ శ్రీనివాసరావు ఇన్‌చార్జి ఈవోగా నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు టెక్కలి డీఎల్‌పీవో ఐవి రమణ ఉత్తర్వులు జారీచేశారు. మండల పరిషత్ కార్యాలయానికి కూడా ఉత్తర్వులు అందాయని ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఈవోగా పనిచేసిన కె.కృష్ణారావు కొత్తపల్లి పంచాయతీ కార్యదర్శిగా నియమితులయ్యారు.

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం

మందస: మండలంలోని ఉద్దాన ప్రాంతమైన చిన్నబహడపల్లి పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేసిన లండ రాజారావు, పులారి నరసింహమూర్తి, కుత్తం సుధాకర్‌లు ఇటీవల వేరే పాఠశాలలకు బదిలీపై వెళ్లారు. దీంతో చిన్నబహడపల్లి గ్రామస్తులు, ఉపాధ్యాయ సిబ్బంది వారిని ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు మంచి సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ బత్తిని వెంకటరావు, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ పుచ్చ రాజేశ్వరి, ఉపాధ్యాయులు చిరంజీవి, జగదీష్ పాల్గొన్నారు. అలాగే పొత్తంగి–సిరిపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో పని చేస్తూ బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం చదువుల విశ్వనాథం, ఉపాధ్యాయులు నగిరి కరుణాకర్, సుశాంత్‌కుమార్ రౌళో, గవ్వ భీమారావు, ఇందిర, జయలలిత, రికార్డ్ అసిస్టెంట్ కృష్ణప్రసాద్‌లను కూడా ప్రస్తుత హెచ్‌ఎం నగిరి తారకేశ్వరరావు ఆధ్వర్యంలో సన్మానించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, పీఎంసీ శివప్రసాద్‌మహంతి, సురేష్‌చంద్రపండా పాల్గొన్నారు. కొత్తపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో సుదీర్ఘ కాలం పాటు పని చేసిన హెచ్‌ఎం పైల సుధారాణి, బి.లక్ష్మీనారాయణ, సీహెచ్ కోటేశ్వరరావులను కూడా గ్రామస్తులు సత్కరించి గౌరవించారు. సర్పంచ్ సేనాపతి దివ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు యవ్వారి నాగేశ్వరరావు, ఎస్.ప్రకాశరావు, న్యాయవాది జి.పున్నయ్య, హెచ్‌ఎం ఎస్.గణేశ్వరరావు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఎం.దామోదర, గవ్వ భీమారావు పాల్గొన్నారు.


చిన్నబహడపల్లిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

తులసమ్మకు ప్రత్యేక పూజలు


కోయనృత్య ప్రదర్శన

ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టి తులసమ్మ తల్లికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రా, ఒడిశా ప్రాంతాల నుంచి గ్రామస్తులు అమ్మవారికి బోనాలు, నైవేద్యాలు సమర్పించారు. తప్పెటగుళ్లు, కోయ నృత్యం, కాళీమాత వేషధారణ, మేళతాళాలతో అమ్మవారిని ఊరేగించారు.

విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్: నగరంలో ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థిని అదృశ్యమైనట్లు ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపారు. కలెక్టర్ బంగ్లా సమీపంలోని ఎస్సీ వీధిలో నివాసముంటున్న విద్యార్థిని ఆర్ట్స్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. ఎప్పట్లాగే ఈ నెల 22న ఉదయం 8.30 గంటలకు కళాశాలకు వెళ్లి తిరిగి రాలేదు. అన్నిచోట్లా వెతికినా ఆచూకీ లేకపోవడంతో తల్లి ఆదివారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శ్రీశయన సంఘ నూతన కార్యవర్గం

సోంపేట: సోంపేట పట్టణ శ్రీశయన సంఘ నూతన కార్యవర్గం ఎన్నికైంది. తోట మోహనరావు అధ్యక్షతన నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా రెల్ల నారాయణ, ఉపాధ్యక్షుడుగా రెల్ల జయరాం, కార్యదర్శిగా గేదెల భీమారావు, ఉపకార్యదర్శిగా ఇంటివెనుక శ్రీను, కోశాధికారిగా దుద్ది రాజు నియమితులయ్యారు. శ్రీశయన సంఘం అభివృద్ధికి తమవంతు కృషిచేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. సోంపేట పట్టణానికి చెందిన 13 శ్రీశయన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గ సభ్యులు

మొక్కలు నాటివేత

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ ఒకటో వార్డు పరిధి మొగిలిపాడులో పలాసకు చెందిన సత్యసాయి భక్తులు ఆదివారం ప్రేమతరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. పలాస సత్యసాయి మందిరం ఈ గ్రామాన్ని దత్తత తీసుకుంది. సాక్షి భక్తులు మల్లా రామేశ్వరం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న సత్యసాయి భక్తులు

బోరు ఏర్పాటు పనులు ప్రారంభం


బోరు ఏర్పాటును పర్యవేక్షిస్తున్న నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: గరుడబద్ర పంచాయతీ పరిధి తర్లాగడూరు గ్రామంలో జిల్లా పరిషత్ నిధులతో ఏర్పాటు చేస్తున్న పవర్ బోర్ పనులను ఆదివారం ప్రారంభించారు. సర్పంచ్ గూడ గిరిజ భూమి పూజ చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పల్లెలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. బోరు ఏర్పాటుకు నిధులు మంజూరు చేసిన జెడ్పీ వైస్ ఛైర్‌పర్సన పాలిన శ్రావణికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గూడ ఈశ్వరరావు, ఉప సర్పంచ్ ఎం.పార్వతి, గ్రామ సంఘ అధ్యక్షుడు కె.కృష్ణ, యువజన సంఘం అధ్యక్షుడు వై.సంతోష్, చంద్రభూషణ్, కె.సురేష్, ఎం.రఘు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సోంపేట: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బైరి అప్పారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోంపేట బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఇచ్ఛాపురం నియోజకవర్గస్థాయి పీఆర్‌టీయూ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు, జిల్లా అధ్యక్షుడు తంగి మురళీమోహన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు ఊహించని రీతిలో మెరుగు పడ్డాయన్నారు. ప్రతి పాఠశాలకు డిజిటల్ అసిస్టెంట్‌ను నియమించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి దానేటి కేశవరావు, రాష్ట్ర బాధ్యులు నగిరి శరత్, రమేష్ పాణిగ్రాహి, జిల్లా బాధ్యులు నీలకంఠం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అప్పారావు

లోకమాన్య తిలక్‌కు ఘననివాళి


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఇచ్ఛాపురం రూరల్: లోకమాన్య తిలక్ జయంతి కార్యక్రమాన్ని ఎం.తోటూరు ప్రాథమిక పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు కొత్తపల్లి సుహాశ్ చంద్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. లోకమాన్య తిలక్ అసమాన ధైర్య సాహసాలు, వీరోచిత పోరాటం, స్వాతంత్ర్య ఉద్యమంలో అంకిత భావం గల వ్యక్తి అని కొనియాడారు. ఆయన చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు.

పీఎం యశస్వికి శిక్షణ ఇవ్వాలని విజ్ఞప్తి

మందస: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం యశస్వి (వైఈటీ) పథకానికి సంబంధించి విద్యార్థులకు శిక్షణ ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ మేరకు విద్యార్థుల తల్లిదండ్రులు వడ్డి గోపాల్, ఎం.ధర్మారావు, వల్లభ, రమేష్ తదితరులు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంట్రన్స్ స్కాలర్‌షిప్ పథకానికి పదో తరగతి విద్యార్థులతో అప్లై చేయించి, పుస్తకాలు, శిక్షణ ఇవ్వాలని విద్యాశాఖాధికారులను కోరారు.

మీనామృతంతో పంటలకు ప్రయోజనం

కంచిలి: మీనామృతం వినియోగంతో పంటలకు చక్కని ప్రయోజనం చేకూరుతోందని ప్రకృతి వ్యవసాయం మండల యాంకర్ టి.శివానందం పేర్కొన్నారు. గోకర్ణపురం యూనిట్ మండపల్లి గ్రామంలో ఎన్‌ఎంపీ షాపు దగ్గర, కుత్తుంలో ఐసీఆర్‌పీ చిట్టిబాబు ఆధ్వర్యంలో మీనామృతం తయారీచేసే విధానాన్ని ఆదివారం ప్రయోగాత్మకంగా చేసి వివరించారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు కామరాజు, ఎం.చిట్టిబాబు, ఐబీ వలంటీర్ కల్పన, పీఆర్పీ తులసయ్య, లీడ్ ఫార్మర్స్ పాల్గొన్నారు.


కుత్తుంలో మీనామృతం తయారీని వివరిస్తున్న చిట్టిబాబు